


నేడు సంఘీభావ పాదయాత్ర

ఆమదాలవలస, కోటబొమ్మాళి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 15న నియోజకవర్గంలో సంఘీభావ పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం మూడు గంటలకు పట్టణంలోని పారిశ్రామికవాడ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పాదయాత్ర ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదుగా కృష్ణాపురం, మెట్టక్కివలస మీదుగా పారిశ్రామికవాడ వద్ద వరకు తిరిగి చేరుకుంటుందని తెలిపారు. **కోటబొమ్మాళి** మండలంలోని కొత్తపేటలో గల టిడిపి నూతన కార్యాలయం నుంచి సంతబొమ్మాళి మండలం పాలేశ్వరిస్వామి ఆలయం వరకు ఈనెల 15న చేపట్టే సంఘీభావ పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు చల్ల సింహాచలం పిలుపునిచ్చారు.

మరువద్దు... ముందు చూపు

- పెరుగుతున్న గ్లకోమా బాధితులు
- ఆలస్యంగా గర్తించడం వల్లే అంధత్వం
- పరీక్షల్లో బయటపడుతున్న కేసులు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కంటి జబ్బులో ప్రమాదకరమైనది గ్లకోమా (నీటికాసుల వ్యా ధి). దీని లక్షణాలు బయటకు కనిపించవు. 90 శాతం మందికి ఇది వచ్చిన విషయం కూడా తెలియదు. కంటి పరీక్షలు చేసినప్పుడు తెలుస్తుంది. నిశ్శబ్దంగా శాశ్వత అంధత్వాన్ని తెస్తుంది. దీని బారిన పడుతున్న బాధితుల సంఖ్య జిల్లాలో ఎక్కువగానే ఉంటోంది. ఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పుడు రక్తం నుంచి విడుదలయ్యే ఆక్వియస్ హ్యూమర్ అనే ద్రవం కంట్లో నిలిచిపోవడం వల్ల ఈ వ్యాధి పుట్టుకొస్తోంది. ప్రతి వంద మందిలో ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. కొందరు ఆలస్యంగా ఆస్పత్రులకు వస్తుండడంతో కంటిచూపును కోల్పోతున్నారు.

గ్లకోమా సోకడానికి కారణాలు ఇవే...

వయసు ఆధారంగా, వంశపారంపర్యంగా ఈ వ్యాధి రావచ్చు. పక్క చూపు క్రమేపీ తగ్గుతుంది. కన్ను తరచూ ఎరుపుగా మారడం, అప్పుడప్పుడు నొప్పిగా అనిపించడం.. కంటి నరంపై ఒత్తిడి పెరగడం వల్ల, స్టెరాయిడ్స్, డ్రాప్స్, మందులు ఎక్కువ కాలం వినియోగించినా గ్లకోమా వచ్చే అవకాశం ఉంది. గ్లకోమా బారిన పడితే కొంతమంది రెండేళ్లలో, మరికొంతమంది ఐదేళ్లలో చూపు కోల్పోతున్నారు. తరచూ కళ్లల్లో నీరు కారడం, నల్లగుడ్డు తెల్లగా మారడం వంటి లక్షణాలు ఈ వ్యాధి సోకిందనడానికి సూచికలు. రోగులకు సకాలంలో శస్త్రచికిత్సతో పరిష్కారం లభిస్తుంది.

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సోంపేటలో ఉన్న ఆరోగ్య వరం కంటి ఆస్పత్రిలో గ్లకోమా బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ రెండు చోట్లా ప్రతినెలా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అవసరమున్న వారికి కార్నియా ద్వారా చూపు వచ్చేలా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. దాతల నుంచి సేకరించిన కార్నియాతో కొంతమందికి చూపు వస్తోంది.

రెడ్‌క్రాస్ ద్వారా కార్నియా సేకరణ

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నేత్రదాతల మరణానంతరం నేత్రనిధి ఆధ్వర్యాన కార్నియాలను సేకరించి భద్రపరుస్తున్నారు. వీటిలో ఆరోగ్యవంతమైన కార్నియాలను కార్నియా మార్పిడి శస్త్రచికిత్స ద్వారా అంధులకు అమర్చి చూపు తెప్పిస్తున్నారు. ముందుగా అంధులు కంటి ఆస్పత్రిని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత కార్నియా మార్పిడితో వారికి చూపు వచ్చే అవకాశం ఉందంటే అలాంటి వారి పేర్లను నమోదు చేస్తారు. దాత నుంచి కార్నియాలు సేకరించిన తర్వాత వరుస క్రమంలో శస్త్రచికిత్స చేసి అమరుస్తున్నారు.

కంటి వైద్య పరీక్షలు తప్పనిసరి



40 ఏళ్లు దాటిన వారంతా విధిగా పరీక్షలు చేయించుకోవాలి. రెటీనాను పరీక్షించి గ్లకోమా ఉందో లేదో వైద్యులు నిర్ధారిస్తారు. మధుమేహం, రక్తపోటు, గ్లకోమా వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా పరీక్షలకు శ్రద్ధ చూపాలి. బిపి, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి. ఒత్తిడికి లోను కాకూడదు. స్టెరాయిడ్స్‌కు దూరంగా ఉండాలి. చక్కటి పోషకాహారాన్ని తీసుకుని కళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

- డాక్టర్ బి.మీనాక్షి,
జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న వి.జి.కె మూర్తి

మూఢ విశ్వాసాలను ప్రోత్సహిస్తున్న కేంద్రం

- పాఠ్యాంశాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం విజ్ఞాన ఉన్నతికి ఆటంకం
- ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగిస్తూ ఎన్‌సిఇఆర్‌టి చేసిన నిర్ణయాన్ని మేధావులు, ప్రజాసంఘాల సంఘాల నాయకులు తప్పుపట్టారు. మూఢ విశ్వాసాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశ అధ్యక్షులు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానాన్ని విద్యార్థులకు దూరం చేయాలన్న ఆలోచన సరికాదన్నారు. ఎన్‌సిఇఆర్‌టి చేసిన నిర్ణయం వల్ల సైన్స్ విద్యకు విఘాతంగా పరిణమిస్తోందన్నారు. ఈ నిర్ణయం రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధమన్నారు.

జీవశాస్త్ర అధ్యాపకులు వై.పోలినాయుడు మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించేందుకు పాఠ్యాంశాలు తొలగించాలని ఎన్‌సిఇఆర్‌టి భావిస్తే, చిట్టచివరి పాఠ్యాంశాలను తొలగించాలే తప్ప మధ్యలో ఉన్న డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం సరికాదన్నారు. కాలమాన పట్టిక ఆధారంగా జన్యుపరమైన మార్పులు సంభవిస్తుంటాయని, అలాంటి సమయంలో కొత్త జీవరాశులు పుట్టుక వస్తుందన్నారు. ఈ వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పేందుకు డార్విన్ సిద్ధాంతం తోడ్పడుతుందన్నారు. దీని పాఠ్యాంశాల నుంచి తొలగించడం సరికాదన్నారు.

ప్రయివేటు కళాశాలల సంఘం అధ్యక్షులు సురంగి మోహనరావు, జామి భీమశంకరరావు మాట్లాడుతూ అనువంశికత, జీవ పరిణామ క్రమంలో వస్తున్న మార్పులపై అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి అబద్ధాలు చెప్పడం తప్ప శాస్త్రీయ దృక్పథం లేదన్నారు. కాషాయీకరణను బలవంతంగా ప్రజలపై రుద్ది శాస్త్రీయ విజ్ఞానాన్ని కాదని భగవత్ సృష్టి అని ప్రచారం చేస్తోందని విమర్శించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయం వల్ల తరగతి గదుల్లో దేశ భవిష్యత్ ఏవిధంగా నిర్మితమవుతుందని ప్రశ్నించారు. సమావేశంలో ప్రజాసాహితీ ఎడిటర్ పి.నాగరాజు, ప్రభుత్వ బాలికల కళాశాల బోటనీ అధ్యాపకులు ఎన్.రుద్రమదేవి, జనవిజ్ఞాన వేదిక నాయకులు పద్మనాభరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.



కచేరి నిర్వహిస్తున్న రామారావు (ఫైల్)

ఆ పాటకు ప్రాణం పోద్దాం

- బోన్ కేన్సర్‌తో బాధపడుతున్న కళాకారుడు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



దాతల సాయం కోరుతున్న రామారావు దంపతులు

ప్రజాశక్తి - కవిటి

మండలంలో ఏ గ్రామంలో కచేరి నిర్వహించినా, ఏ ఆలయంలో భజన కార్యక్రమం చేపట్టినా అన్నమయ్య కీర్తనలు, భక్తి పాటలతో ఆహూతులను అలరించే ఆ గొంతు ప్రస్తుతం తడబడింది. వృత్తి రీత్యా తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా, ప్రవృత్తి రీత్యా కచేరీలు, భజన పాటలతో గుర్తింపు పొందిన ఆ గొంతు దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. కవిటి మండలం కొమ్ముపుట్టుగకు చెందిన తోట రామారావు తాపీ పనిచేసుకుంటూ భార్య యోగీశ్వరి, పిల్లలు పావని, జ్యోత్స్నలను పోషించుకుంటున్నాడు. మొదట్నుంచీ సంగీతంపై ఉన్న ఆసక్తి రామారావును మండలంలో ఓ మంచి కళాకారునిగా గుర్తింపు తెచ్చిపెట్టింది. జీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో ఇటీవల అస్వస్థతకు గురయ్యాడు. విశాఖపట్నంలో వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత బోన్ కేన్సర్ బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారు.

పనులకు వెళ్లలేని పరిస్థితుల్లో రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. కేన్సర్ వైద్యం కోసం అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని, అంత ఆర్థికస్తోమత తమకు లేదని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ తండ్రి తాపీ పనిచేస్తున్నా, ఒక కళాకారుని గానే గుర్తింపు పొందారని, దాతలు ఉదారంగా స్పందించి కళాకారుడిని ఆదుకోవాలని ఆ చిన్నారులు కోరుతున్నారు. దాతలు ఉదారంగా స్పందించి ఫోన్ పే నంబరు 9959592575, ఎస్‌బిఐ ఖాతా నంబరు 33476852926 ఆర్థికంగా సహాయం అందించాలని రామారావు కుటుంబసభ్యులు కోరుతున్నారు.



అరసవల్లికి పెరిగిన రద్దీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైశాఖ మాసం బహుళ ఏకాదశి ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. వేకుమజాము నుంచి ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన సందర్శకులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఒకవైపు ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. వారికి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. రద్దీ పెరగడం వల్ల ఆలయానికి ఆదివారం ఒక్కరోజు రూ.13.15 లక్షల మేర ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.9,99,800, విరాళాల రూపంలో రూ.65,987, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,50,000 ఆదాయం సమకూరినట్లు చెప్పారు.

జూన్ 10 వరకు హెల్త్‌కార్డు గడువు


ప్రజాశక్తి - శ్రీకాకుళం

న్యాయవాదులు హెల్త్‌కార్డు పొందేందుకు జూన్ పదో తేదీ వరకు గడువు ఉందని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ని సూర్యారావు, పొన్నాడ రాము ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ మెడిక్లెయిమ్, పర్సనల్ యాక్సిడెంట్ పాలసీలు 2023-24 సంవత్సరానికి న్యాయవాదులకు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్, ప్రభుత్వ గ్రాంట్ కింద ప్రత్యేక కమిటీ 2023-24 సంవత్సరానికి న్యాయవాదులకు గ్రూప్ మెడిక్లయిమ్, వ్యక్తిగత ప్రమాద విధానాలు ఖరారు చేసిందని తెలిపారు. కుటుంబంలో న్యాయవాదితో పాటు మరో ముగ్గురు (భార్యాపిల్లలు, ఆధారపడి ఉన్న వారు)కు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. ప్రీమియంలో దాదాపు 1/3వ వంతు సంబంధిత బీమా చేసిన న్యాయవాది చెల్లించాలని, మిగిలిన మిగిలిన మొత్తాన్ని ఎపి ప్రభుత్వ గ్రాంట్, బార్ కౌన్సిల్ నిధుల నుంచి చెల్లిస్తారని తెలిపారు. ప్రమాదవశాత్తు న్యాయవాది చనిపోతే (కుటుంబ సభ్యులకు వర్తించదు) రూ.10 లక్షల పరిహారం అందుతుందని చెప్పారు. 70 ఏళ్ల లోపు న్యాయవాదులు మాత్రమే పాలసీకి అర్హులని స్పష్టం చేశారు.

ఉచిత మోడల్ లాసెట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి బిసి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యాన నగరంలోని ఎంపిఆర్ లా కళాశాలలో ఉచిత మోడల్ లాసెట్‌ను ఆదివారం నిర్వహించారు. లాసెట్ పరీక్షకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్న పలువురు అభ్యర్థులు మోడల్ పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను ఎపి బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాసెట్ పరీక్షకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు అవగాహన లేక ఇబ్బందులు పడుతుంటారని, వారికి ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మోడల్ లాసెట్ ఐదేళ్లుగా సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడల్ లాసెట్ నిర్వహణకు సహకరించిన లా కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్ కె.మోషేకు కృతజ్ఞతలు తెలిపారు.



డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ సరఫరా

- విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి
- భవిష్యత్‌లో విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లు
- నెల రోజుల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్లకు కరెంట్
- ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబరు 1912
- ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎల్.దైవప్రసాద్





ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేసవి నేపథ్యంలో జిల్లా విద్యుత్ వాడకం డిమాండ్ కంటే అధికంగా ఉంటోందని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి ఇపిడిసిఎల్) సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎల్.దైవప్రసాద్ తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని చెప్పారు. ఇదే సమయంలో విద్యుత్ వృథా వాడకాన్ని తగ్గించుకోవాలని వినియోగదారులను కోరారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

వేసవిలో విద్యుత్ డిమాండ్ ఉలా ఉంది?

జిల్లాలో సాధారణ రోజుల్లో 312 మెగావాట్లు విద్యుత్ అవసరాలకు సుమారు ఐదు మిలియన్ యూనిట్లు అవసరం. వేసవి సీజన్‌లో ఈ డిమాండ్ పెరుగుతోంది. శనివారం ఒక్క రోజే 312 మెగావాట్ల విద్యుత్ కెపాసిటీ అవసరాలకు 6.086 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. వాణిజ్య అవసరాలతో పాటు గృహ వినియోగం కూడా పెరుగుతోంది. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

విద్యుత్ ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయడం ద్వారా సకాలంలో వాటిని మార్చడానికి వీలవుతుంది. వదులు తీగలు, విరిగిన స్తంభాలు మార్చడం కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసింది. ఎక్కడైనా అవసరం ఉన్నట్లయితే తక్షణమే మార్పిడికి అవకాశం కల్పిస్తాం. వేసవిలో ప్రజల అవసరాలకు తగ్గట్లు పొదుపుగా విద్యుత్‌ను వినియోగించాలి. అవసరం లేని చోట విద్యుత్ వినియోగం వల్ల వృథా అవుతుంది.

లో ఓల్టేజ్ సమస్యను ఎలా అధిగమిస్తారు?

జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే సంస్థ లక్ష్యం. అందుకు తగ్గట్లు ఎప్పటికప్పుడు మార్పులతో ముందుకెళ్తున్నాం. గతంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే గంటలు, రోజుల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఫిర్యాదు చేసిన గంట వ్యవధిలోనే మరమ్మతులు పూర్తి చేస్తున్నాం.

వినియోగదారులకు నిరంతరాయంగా సేవలు అందిస్తున్నాం. అందుకు తగ్గట్లు క్షేత్రస్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండడం వల్ల పనుల్లో వేగం పెరిగింది. తద్వారా సాంకేతిక లోపాలను సకాలంలో సరిదిద్దడానికి వీలు కలుగుతోంది.

విద్యుత్ ప్రీ పెయిడ్ మీటర్లు జిల్లాలో ఏర్పాటు చేయనున్నారా?

వినియోగదారులు సాంకేతికంగా ఇప్పుడు అవగాహన కలిగి ఉంటున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే విద్యుత్ సేవలన్నీ ఉన్నట్లే. విద్యుత్ బిల్లుల చెల్లింపులకు క్యూలైన్లలో నిలబడాల్సిన పని లేకుండా ఇంట్లో నుంచి చెల్లించుకునేందుకు వీలు కల్పిస్తూ అనేకరకాలైన యాప్‌లను అందుబాటులోకి తీసుకురావడమైంది. భవిష్యత్‌లో ప్రీ పెయిడ్ మీటర్లు రానున్నాయి. టెలికాం వినియోగదారుల తరహాలోనే ఈ చెల్లింపులు జరుగనున్నాయి. వినియోగదారులు ఎంతమేరకు విద్యుత్ వినియోగిస్తారో ముందుగానే అంచనా వేసుకోవచ్చు.

మీటరు రీడింగ్ ఆలస్యం వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందన్న విమర్శలు వస్తున్నాయి?

మీటరు రీడింగ్ సకాలంలో తీయించడం జరుగుతోంది. ఆ నెలలో వాడిన విద్యుత్ యూనిట్ల ఆధారంగానే బిల్లు వస్తుంది. యూనిట్ల కేటగిరీలో మార్పు గానీ, అదనపు భారం పడే అవకాశం గానీ ఉండదు. విద్యుత్ బిల్లు సకాలంలో చెల్లించకపోతే అపరాధ రుసుము విధించడమవుతుంది. వినియోగదారులు బాధ్యతగా గడువు లోగా బిల్లులు చెల్లించాలి.

ఏదైనా కారణంతో విద్యుత్ బిల్లు పొందని వినియోగదారులు తమ బిల్లు వివరాలను www.apeasternpower.com వెబ్‌సైట్‌లో View Bill అనే ఆప్షన్ ద్వారా తెలుసుకొని ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించుకోవచ్చు. బిల్లుల చెల్లింపునకు ఇపిడిసిఎల్ మొబైల్ యాప్ గానీ ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం తదితర యుపిఐ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చు.

విద్యుత్ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

విద్యుత్ వినియోగదారులకు నిరంతర సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడ ఇబ్బందులు తలెత్తినా క్షణాల్లో ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబరు 1912ను అందుబాటులోకి తీసుకురావడమైంది. జిల్లాలో ఎక్కడి నుంచైనా ఈ నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. ఎక్కడైనా సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే సర్కిల్ కార్యాలయానికి, డివిజన్ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. సమస్యను పరిష్కరించడంతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఇటీవల కొత్తగా నియమితులైన 845 మంది ఉపాధ్యాయులకు మూడు కేంద్రాల్లో ఈనెల 15 నుంచి ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్‌సి-98 ఉపాధ్యాయులు 330 మంది, డిఎస్‌సి-08 అభ్యర్థులు 111మంది, డిఎస్‌సి-18 ద్వారా 404 మంది ఉపాధ్యాయులుగా నియమితులైనట్లు పేర్కొన్నారు. వీరిలో డైట్ వమరవల్లి శిక్షణా కేంద్రంలో 292 మంది, పాలకొండ తమ్మినాయుడు కళాశాలలో 248 మంది, కాశీబుగ్గ జెడ్‌పి హైస్కూల్‌లో 305 మంది హాజరు కావాల్సి ఉందని తెలిపారు. మూడు విడతల్లో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా నుంచి ఇతర ప్రాంతాల్లో ఎంపికై నియమితులైన ఉపాధ్యాయులకు ఈ మూడు కేంద్రాల్లో శిక్షణ పొందడానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడత 15 నుంచి, రెండో విడత 22 నుంచి, మూడు విడత 29 నుంచి శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. శిక్షణా కాలంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నామని, నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9493576778, 7382772820 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఐటిఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రయివేటు పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు (ఐటిఐ)లో ప్రవేశానికి జూన్ ఆరో తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల సమన్వయకర్త కె.ఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు అనంతరం ఎక్‌నాలెడ్జ్‌మెంట్ పొంది ఎచ్చెర్ల, శ్రీకాకుళం డిఎల్‌టిసి, పలాసలోని ప్రభుత్వ ఐటిఐల్లో నిర్వహించే దరఖాస్తుల పరిశీలనకు హాజరు కావాలని తెలిపారు. పరిశీలనకు హాజరు కాకుంటే కౌన్సెలింఘుకు అనర్హులవుతారని స్పష్టం చేశారు. మూడు ప్రభుత్వ ఐటిఐల్లో 640, 20 ప్రయివేటు ఐటిల్లో 3036 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఐటిఐల్లో రెండేళ్ల ట్రేడ్‌లు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్... ఏడాది ట్రేడ్‌లు డీజిల్ మెకానికల్, వెల్డర్, కటింగ్ అండ్ సీయింగ్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రాం అసిస్టెంట్ ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన అనతరం కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలను సంప్రదించాలని సూచించారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com



పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీదేవి

జిల్లా కీర్తి ప్రతిష్టలను పెంచాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడాకారులు నూతన ఉత్తేజాన్ని పెంపొందుంచుకుని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. నగరంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో మాస్టరు సాయిబాబా మెమోరియల్ జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ఎల్లప్పుడూ ఆస్వాదించే రీతిలో ఉండాలన్నారు. స్నేహపూరిత వాతావరణంలో పోటీలు జరగాలన్నారు. పోటీ పడిన వారంతా విజేతలు కాలేరని, అయినా మనోధైర్యం కోల్పోకుండా పోటీల్లో తమ వంతు ప్రయత్నం సాగించాలని అన్నారు. కార్యక్రమంలో రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓంకార్, ఆనందరావు

జీడి బోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస

కేరళ రాష్ట్రం మాదిరిగా పలాస కేంద్రంలో జీడి బోర్డును ఏర్పాటు చేసి జీడి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు బి.ఓంకార్, కౌలు రైతు సంఘం నాయకులు బమ్మిడి ఆనందరావు డిమాండ్ చేశారు. పలాసలోని ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అనేక ఆటుపోట్లు, చీడ పీడలను ఎదుర్కొని ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి పెడుతున్నారని అన్నారు. పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 80 కేజీల బస్తాకి దిగుబడి 23 కేజీల పప్పు ధర సగటున స్థానిక ధర ప్రకారం రూ.19,550 వస్తుందని అన్నారు. ఇదే పప్పుని ఎగుమతి చేస్తే రూ.23 వేలు వస్తుందని పేర్కొన్నారు. అలాటప్పుడు రైతులకు వచ్చే ధర ఎందుకు తగ్గుతుందని వారు ప్రశ్నించారు. ఇలా రైతులను దగా చేస్తుంటే... ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం సరైన చర్య కాదని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలుతో పాటు 80 కేజీల బస్తా రూ.3 వేలు బోనస్ ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ ప్రభుత్వం జీడి రైతులకు ఇచ్చిన మామీలు అమలు చేయాలన్నారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి- రణస్థలం

బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రణస్థలం మండల కేంద్రంలో ఆర్‌టిసి బస్టాండ్ ఉంది. జాతీయ రహదారి ఆరు లైన్లు రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్‌టిసి బస్టాండ్ నిరుపయోగంగా ఉంది. దీంతో ఇక్కడ బస్ షెల్టర్ లేకుండాపోయింది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ... ప్రయాణికులు బస్సుల కోసం, ఆటోల కోసం రోడ్డుపై నిల్చొంటున్నారు. ప్రధానంగా మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది. రణస్థలం మండల కేంద్రంలో దాదాపు 15 నుంచి 20కి పైగా విద్యా సంస్థలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ ఉన్నాయి. రాష్ట్రం నలుమూలలకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వలస



బస్సుల కోసం రోడ్డుపై వేచి ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు

కూలీలు తదితరులు రణస్థలంలోనే సెంటర్‌లోనే బస్సు ఎక్కాలి. బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇక్కడున్న షాపులు, లాడ్జీలు, కిరాణాషాపుల ఎదుట ప్రయాణికులు నిల్చుని ఉంటున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇరు వైపుగా ఉన్న షాపులు, ఇళ్లను నేలమట్టం చేయడంతో ప్రయాణికులకు ఆ కొద్ది నీడా లేకుండాపోయింది. రణస్థలం మండలంలోని సుమారు చిన్న పెద్ద కలిపి 90 వరకు గ్రామాలు ఉన్నాయి. ఈ సెంటర్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయి. బస్సుల కోసం గంటలకొద్దీ ఎర్రటి ఎండలో రోడ్డు పక్కనే వేచి ఉండాల్సి వస్తోంది. కొద్దిపాటి వర్షం కురిసినా తలదాచుకునేందుకు చోటులేక లగేజీలు, పిల్లాపాపలతో తడవాల్సి వస్తోంది. ఆర్‌టిసి అధికారులు స్పందించి బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కానరాని మరుగుదొడ్లు

నిత్యం వందలాది మంది ప్రయాణికులతో వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారితో రణస్థలం సెంటర్ కిటకిటలాడుతుంది. ప్రధానంగా ఈ ప్రాంతంలో మరుగుదొడ్డి సౌకర్యం లేక బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు, బస్సు దిగిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళా ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా పంచాయతీ పాలక వర్గం పబ్లిక్ మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు.

చిన్ననాటి జ్ఞాపకాలు మర్చిపోలేనివి



వజ్రపుకొత్తూరు : నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చిన్నప్పుడు చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి, కేరింతలు ఒక్కసారి గుర్తు చేసుకుంటే మర్చిపోలేనివని 1996-97 బ్యాచ్‌కు విద్య నేర్పిన గురువులు ఫాల్గుణరావు, తులసీరావు అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97లో చదువుకున్న విద్యార్థులు కాశీబుగ్గ కీర్తన ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలు తరువాత మళ్లీ ఒకసారి కలవడం ఆనందగా ఉందన్నారు. కాశీబుగ్గ హైస్కూల్ వదిలి 25 వసంతాలు పూర్తవుతుందని అన్నారు. మీ బ్యాచ్ అందరూ వేర్వేరు వృత్తిల్లో ఉన్నత స్థాయిలో ఉండడం మాకు గర్వ కారణంగా ఉందని అన్నారు. ఇలాంటి అనుభూతి పూర్వ విద్యార్థులు కలయక మళ్లీ రాదన్నారు. మీరు సిల్వర్ జూబిలీలో కలవడం మీరు ఇచ్చే గౌరవం ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటే శరీరం పులకరిస్తుందన్నారు. అలాగే 25 వసంతాలు తరువాత ఒక్కసారి ఆనాటి చదువుకున్న స్నేహితులు అందరూ ఒక్కసారిగా ఎదురెదురుగా చూసి పలకరిచడం, గుండెకు హత్తుకొని ఆప్యాయంగా పలకరించి చిన్ననాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్య బుద్ధులు నేర్పిన గణితం ఉపాధ్యాయులు క్షోని ఫాల్గుణరావు, బయోలాజికల్ ఉపాధ్యాయులు తులసీరావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. గ్రూప్ ఫొటోలు తీసుకొని మిమిక్రి, డాన్సులు చేశారు. 96-97 ఆర్గనైజింగ్ సభ్యులు శీలం నవీన్‌కుమార్, వినోద్, నరేష్, హరిప్రసాద్, మోహన్, శ్రీధర్, పద్మ, సుధారాణి, శ్యామల, కుమారస్వామి, నాని, దీప, వైకుంటారావు, మాధవరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నౌపడ: సంతబొమ్మాళి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-2001 వరకు చదువుకున్న పూర్వ



నౌపడ : నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. పాఠశాల హెచ్‌ఎం బిజకామరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.రామ్మోహనరావు, ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన 70 మంది విద్యార్థులు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో చదువుకున్న జ్ఞాపకాలు, పరిచయాలు నెమరు వేసుకున్నారు. వివిధ రకాల రంగాల్లో పనిచేస్తున్న వారి వివరాలు, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే పెద్ద మర్రిపాడు పాఠశాలలో చదువుకున్న 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గత జ్ఞాపకాలు, యోగక్షేమాలు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారి విశేషాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, ప్రభాకరరావు, శ్రీనివాసరావు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, విద్యావతి పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు రాజు

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దూసిపేటలో శ్రీకాకుళం నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆస్పత్రి వైద్యులు రాజు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎండలో ఎక్కువగా తిరగవద్దని సూచించారు. అధిక మొత్తంలో మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు తీసుకోవడం వల్ల వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తరచూ సుగర్, బిపిలను పరీక్షించుకుని మందులను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో విఫలం



అన్నాజీరావు

ఆమదాలవలస : పేదలకు బాసటగా నిలిచే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ సనపల అన్నాజీరావు అన్నారు. ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడారు. శనివారం కర్ణాటక రాష్ట్రంలో వెలువడిన ఫలితాలే రాబోయే రోజుల్లో దేశం మొత్తం మీద పునరావృతం అవుతాయని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో వైసిపి దొందూ దొందేనని విమర్శించారు. మోడీ కార్పొరేట్లకు అనుకూలంగా ఉంటూ... పేదలపై భారాలు వేస్తూ జీవన స్థితిగతులను మార్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.500 ఉంటే... ప్రస్తుతం 11 వందలకు పైగా పెంచేశారని అన్నారు. ఇదేనా అచ్చాదీన్ అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వైసిపి కూడా మోడీ అడుగులకు మడుగులొత్తుతూ పాలనను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని తరగతుల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. రాబోయే రోజుల్లో ధరలు అందుబాటులో ఉండి సుపరిపాలన అందాలన్నా, పేదల జీవన స్థితిగతులు మెరుగుపడాలన్నా కాంగ్రెస్ పార్టీని బలపరచాలని ప్రజలను కోరారు.

పోర్టులో ఎగ్జామినర్‌గా

రత్నకుమార్ ఎంపిక



రత్నకుమార్

ఆమదాలవలస : మండలంలోని వంజంగిపేటకు చెందిన పొన్నాడ రత్నకుమార్ శనివారం వెలువడిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ గ్రాంట్ లెవల్ పరీక్షా ఫలితాల్లో గ్రేడ్-2 కేటగిరికి చెందిన పోర్టు (ఓడ రేవు)ల్లో ఎగ్జామినర్ పోస్టుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం రత్నకుమార్ చిత్తూరు జిల్లాలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన తండ్రి అప్పారావు ఎల్ఐసి ఏజెంట్‌గా చేస్తున్నారు. తల్లి గృహిణి. ఉన్నత ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

నేడు లోలుగులో స్పీకర్ పర్యటన

పొందూరు: పొందూరు మండలంలోని లోలుగు కెజిబివి పాఠశాలలో రూ.1.60 కోట్లతో నూతనంగా నిర్మించిన భవనాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ప్రారంభిస్తారని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమానికి మండలంలోని అధికారులు, వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యర్తలు పాల్గొవాలని కోరారు.

కొండెక్కిన కోడి

టెక్కలి: మాంసాహరులకు నోరూరించే కోడి మాంసం ధర ఒక్కసారిగా పెరిగింది. కొద్ది రోజుల క్రితం కిలో రూ.200 ఉండే కోడి మాంసం ధర ఆదివారం నాటికి కిలో రూ.300కు పెరిగింది. వేసవి కాలం కోళ్ల పరిశ్రమలో ఉత్పత్తి తక్కువ కావడంతో కోడి మాంసం ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపారులు భావిస్తున్నారు. కాగా, ప్రస్తుతం ప్రతి గ్రామాల్లో అమ్మవారి సంబరాలు, గ్రామ దేవత ఉత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. వచ్చే బంధువులకు, స్నేహితులకు కోడి మాంసంతో భోజనాలు పెడుతుండడంతో డిమాండ్ పెరిగింది దీనిని ఆసరాగా తీసుకుని వ్యాపారులు అమాంతంగా పెంచేశారు. మరో ఆశించినంత రీతిలో ఉత్పత్తి లేకపోవడంతో మాంసం అమ్మకాలకు డిమాండ్ పెరగడంతో కోడి మాంసం ధరలు పెరగడానికి గల కారణాలని భావిస్తున్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

హనుమాన్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో వద్ద ఉన్న ఆంజనేయ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన వెయ్యి మంది యాత్రికులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చీమలవలసలో హనుమాన్ జయంతి సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానానికి వెయ్యి మంది వరకు యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, ఆప్తాలిక్ అసిస్టెంట్ నూక మల్లేశ్వరరావు, వర్తక సంఘం అధ్యక్షుడు శిల్లా మల్లికార్జునరావు, పైడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలాస, పురుషోత్తపురం గ్రామం వద్ద ఆంజనేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమీప శివాలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం చిన్నారులు ఆంజనేయ వేషధారణలో ఇచ్చిన పలు



ఆమదాలవలస : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

ప్రదర్శనలు ప్రజలకు ఆకట్టుకున్నాయి.

బూర్జ : మండలంలో డొంకలపర్తలో ఆంజనేయ జయంతి సందర్భంగా రెండు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్డు కృష్ణచందక, ఆంజనేయులు, జడ్డు చిన్ననాయుడు, అప్పలనాయుడు, బాలరాజు, గుమ్మడి రామినాయుడు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు, తర్లిపేట, ఊడికలపాడు, లఖందిడ్డి, గంగరాం, కురుడు, దంత, హరిశ్చంద్రపురం, యలమంచిలి గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యమ్రాల్లో సనపల కరుణ్‌కుమార్, వెలమల చిన్నారావు అన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కృష్ణదాస్‌కు ఘన స్వాగతం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం గ్రామ దేవత సంబరాలు ముగింపు దశకు చేరుకుంది. ఈ నెల 15తో ముగుస్తుంది. గ్రామ దేవత ఉత్సవాలను నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆదివారం దర్శించారు. ఈయనకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అంగరంగ వైభవంగా జరుగుతున్న సంబరాలు తిలకించడానికి వేలాది మంది ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. అలాగే బిజెపి నాయకులు పైడి వేణుగోపాల్, ఉమామహేశ్వరరావు తదితరులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. రాత్రి సమయంలో నిర్వహిస్తున్న



కృష్ణదాస్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

సంస్కృతిక కార్యక్రాలకు ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు



ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించటమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని, అందులో భాగంగా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి వేసి తాగునీరు అందిస్తున్నామని మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావులు అన్నారు. కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీ వాసులకు ఇంటింటికీ కుళాయిలను ఆదివారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో తాగునీటి కోసం ప్రకాష్‌నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రెండు, మూడు రోజులకోసారి ట్యాకర్ల ద్వారా తాగు నీరు అందించేవారని అన్నారు. ప్రస్తుతం రోజూ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబరు దాసరి అరుణమోహన్, కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, దేవాది రాము, వైసిపి నాయకులు ఇర్రి చిరంజీవి, తాటిపర్తి రామారావు, ఆర్.ప్రశాంత్‌కుమార్, వాలంటీర్లు, అర్‌డబ్ల్యూఎస్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో ప్రపంచ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని బాలింతలకు వైద్యులు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో తల్లులకు ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహార ఆవశ్యకతను తల్లులకు వివరించారు. ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ పేడాడ లాస్య పాల్గొని తల్లులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



శ్రీకాకుళం అర్బన్ : పళ్లు అందజేస్తున్న డాక్టర్ లాస్య

ప్రసవానంతరం తల్లులు వారి ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. ఈ సమయంలో పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు తల్లులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆమదాలవలస : పట్టణంలోని అరుణోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, హౌస్ ఆఫ్ ప్రేయర్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా మాతృదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అరుణోదయ సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ మిస్సాల కేరి ప్రపుల్‌కుమార్, విశ్రాంత ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాతృదేవోభవ అంటే తల్లి ప్రత్యక్ష దైవమని, అమ్మకు ఉన్న సహజ లక్షణాల్లో అమ్మ జన్మనిస్తుందని, పోషిస్తూ ప్రాణం కంటే ఎక్కువగా



ఆమదాలవలస : తల్లిని సన్మానిస్తున్న ప్రపుల్‌కుమార్

ప్రేమిస్తుందని అన్నారు. అటువంటి అమ్మను బిడ్డలు మానవతా దృక్పథంతో బాధ్యతతో ఆమె ఆనందానికి పాటుపడాలని అన్నారు. ఆమెత్యాగము ప్రేమను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన కె.బాలలక్ష్మి, రిటైర్డ్ ఆరోగ్యశాఖ, రాచకొండ రాజేశ్వరి, మున్సిపల్ కార్యాలయం ఇలా సుమారు 15 మంది తల్లులను గుర్తించి ఆశీర్వాద సత్కారాలతో ఘనంగా గౌరవించి మాతృమూర్తుల ఆశీర్వచనాలు, దీవెనలు ప్రతిఒక్కరూ తీసుకున్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జి.బి.సాంబమూర్తి, పోలారావు, ధనలక్ష్మి, అప్పలరాజు, సింహాచలం పాల్గొన్నారు.

పట్టణంలో చలివేంద్రం ఏర్పాటు

ఆమదాలవలస : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబేద్కర్ యువజన సంఘం చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆనందదాయకమని జనసేన నాయకులు పాత్రుని పాపారావు, పేరాడ రామ్మోహనరావు అన్నారు. పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి తాపం నుంచి సేద తీరడానికి ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువజన సంఘం సభ్యులు మున్ముందు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామ్మోహనరావు

నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జనసేన మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, సిర్లాపు గణేష్, బగాది ఫణికుమార్, సింహాచలం, హనుమంతు అనూష్‌కుమార్, అశోక్, గుంగు కోటేష్, ధనుంజయరావు, రాజశేఖర్, శ్రీనివాస్, అప్పలరాజు, రాంబాబు, రాజు పాల్గొన్నారు.

ఉచిత మందుల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యాన ఉచిత వైద్య మందులు పంపిణీ చేశారు. మండలంలో అన్నంపేట పంచాయతీ పరిధిలో జంగాలపాడులో ఆదివారం సత్యసాయి సేవ జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు, ఎంపిపి కె.దీప ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ వైద్య మందే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎ.శివకుమార్, ఎం.జనార్ధన్, డాక్టర్ పి.తాతయ్య, డాక్టర్ సుభాష్ చంద, ఎన్.జ్యోతి, జి.పవన్, సాయికృష్ణ, ఎస్.వి.గురుప్రసాద్, ఎం.రవీంద్రబాబు పాల్గొన్నారు. అంతకుముందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే పౌష్టికాహారం, గొడుగులు, చెప్పులు పంపిణీ చేశారు. మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

లావేరు : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని రిసోర్స్ పర్సన్ ప్రగడ రాందేవ్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చిన్నతనంలో సెల్‌ఫోన్లు వాడకూడదు అనే అంశంపై మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రామంలో ఉండే గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు సెల్‌ఫోన్ చూసినట్లయితే చదువుపై ఏకాగ్రత ఉండదన్నారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ ఇనుపకుర్తి జాహ్నవి భూతకాలం, వర్తమాన కాలం భవిష్యత్



లావేరు : పాఠాలను బోధిస్తున్న విద్యార్థిని

కాలం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : బలగ శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పిల్లలకు మొదటగా హిందీ, ఇంగ్లీష్ పేపర్లను చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను మాట్లాడుతూ మాతృ భాషతోపాటు జాతీయ, అంతర్జాతీయ భాషలైన హిందీ, ఇంగ్లీష్ కూడా నేర్చుకోవడం ఎంతో ముఖ్యం అని తెలిపారు. అనంతరం ఆటల పోటీల్లో భాగంగా పిల్లలకు లెమన్ స్పూన్ ఆడించారు. విజేతలకు గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి పి.వి.భాస్కరరాజా విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 18 మంది విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ వేసవిలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చే విధంగా తల్లితండ్రులు వారి పిల్లలను ప్రోత్సహించాలని కోరారు.

టెక్కలి : చదువుతో పాటు ఆటల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని టెక్కలి గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు క్రికెట్, మ్యూజికల్ చైర్ ఆటలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయల సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.



బలగ : లెమన్ స్పూన్ ఆట ఆడుతున్న విద్యార్థులు



పొందూరు : చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



బావి అంచున పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

తాగునీరు గరళం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పెద్దబొడ్డపాడు కాలనీ వాసులు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. పెద్దబొడ్డపాడు కాలనీ అంతటికీ తాగునీటి అవసరాలు కోసం ఈ బావి నీటి పైనే ఆధారపడతారు. అయితే బావి శుభ్రత లేకపోవడంతో గోడలకు పిచ్చి మొక్కలు మొలిచాయి. పిచ్చి మొక్కల ఆకులు, చెత్త చెదారం పడి తాగునీరు కలుషితమవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీరు తాగి పలువురు రోగాలు బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత కోసం చర్యలు తీసుకోకపోవడం వల్ల విధిలేని పరిస్థితిలో కలుషిత నీరు తాగాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి బావి పరిశుభ్రతకు పంచాయతీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.